రైతులకు మినీ సాయిల్ టెస్టింగ్ కిట్స్: తుమ్మల

హైదరాబాద్, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ): రైతులకు మినీ సాయిల్ టెస్టింగ్ కిట్స్‌ను వెంటనే అందించాలని అధికారులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మట్టి పరీక్షల నిర్వహణపై హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 భూసార పరీక్షా కేంద్రాలను రైతులకు మరింత అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.

పంటల బీమాపై కసరత్తు

హైదరాబాద్, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ): పంటల బీమా పథకం అమలుకు విధి విధానాలను రూపొందించడంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గురువారం అధికారులతో సమావేశమైంది. ఎన్నికల కోడ్ ముగిసేసరికి టెండర్లు పిలిచేలా కార్యాచరణ రూపొందిస్తున్నది. వానకాలం సీజన్ నుంచే పంటల బీమాను అమలు చేసేలా చర్యలు చేపట్టింది.

నల్లా పాయె.. డ్రమ్ము వచ్చె!

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో ఎన్నడూ లేని విధంగా తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. నల్లా నీరు రాకపోవడంతో ప్రతి ఒక్కరూ తాగడానికి, గృహ అవసరాల కోసం ఇంటి ముందు డ్రమ్ములు ఏర్పాటు చేసుకుంటూ జీపీ ట్యాంకర్ ద్వారా వచ్చే నీటితో నింపుకుంటున్నారు. గతంలో ప్రతి రోజూ మిషన్ భగీరథ నల్లా ద్వారా కుటుంబానికి సరిపోయేంత నీరు వచ్చేదని, ఇప్పుడు ట్యాంకర్ ద్వారా డ్రమ్ము నీటితో మూడు రోజులు సరిపెట్టుకునే పరిస్థితి వచ్చిందని గ్రామస్తులు వాపోతున్నారు. కాంగ్రెస్ వస్తే ఇలాంటి మార్పు వస్తుందనుకోలేదని మండిపడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తాగు నీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు. - గంభీరావుపేట

ప్రిన్సిపాళ్ల కక్కుర్తి.. పిల్లల ప్రాణం మీదికి!

- సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో వరుస ఘటనలు
- 4 నెలల కిందటే ముథోల్ గురుకుల కాలేజీలో అస్వస్థతకు గురైన 76 మంది విద్యార్థులు
- నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత లేనందునే
- విచారణ కమిటీ వెల్లడించిన వాస్తవాలు ఇవీ
- అయినా మేల్కొనని సొసైటీ ఉన్నతాధికారులు
- షోకాజ్ మెమోలు తప్ప బాధ్యులపై చర్యల్లేవ్
- అధికారుల మామూళ్ల దందాలు, ఉదాసీనత ఫలితమే భువనగిరి ఉదంతం..

హైదరాబాద్, ఏప్రిల్18 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీల్లో వరుస ఘటనలకు ప్రిన్సిపాళ్ల నిర్లక్ష్యమే కారణమని తెలుస్తున్నది. కాసుల కక్కుర్తి విద్యార్థుల ప్రాణాల మీదకు తెస్తున్నదని స్పష్టంగా తేలిపోతున్నది. నిర్దేశిత నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, అత్తెసరు సరుకులతో ఆహారాన్ని వండిపెడుతుండటం, పర్యవేక్షణ గాలికి వదిలేయటం వల్లే అనారోగ్యానికి గురవుతున్నారని స్పష్టమవుతున్నది. 4 నెలల క్రితం నిర్మల్ జిల్లా ముథోల్ గురుకుల కాలేజీ ఘటనపై కమిటీ ఇచ్చిన నివేదికే సాక్ష్యంగా నిలుస్తున్నది. అయినా సొసైటీ ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోకపోవటంతో భువనగిరి పాఠశాల ఘటన పునరావృతమైందని తెలుస్తున్నది.

వాడిన నూనె మళ్లీ మళ్లీ..

నిర్మల్ జిల్లా ముథోల్ సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీలో గత జనవరిలో కలుషిత ఆహారం తిని 76 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో దవాఖాన పాలయ్యారు. ఈ ఘటనపై జాయింట్ సెక్రటరీ అనంతలక్ష్మి నేతృత్వంలో విచారణ కమిటీని సొసైటీ సెక్రటరీ నియమించారు. ఆ కమిటీ ప్రతినిధులు జనవరి 27న క్షేత్రస్థాయిలో పర్యటించి.. వైద్యాధికారులు సూచించిన చర్యలు తీసుకోవటంలో ప్రిన్సిపాళ్లు విఫలమయ్యారని, క్యాంపస్, డార్మెటరీలు, వంటగది ప్రాంతం, డైనింగ్ హాల్ ఆర్కాలో పరిశుభ్రత లోపించిందని, కొన్ని మరుగుదొడ్లు పనిచేయటం లేదని, చాలా మంది విద్యార్థులుబహిరంగ మలవిసర్జనకు అలవాటు పడుతున్నారని తెలిపారు. పిల్లలు బ్యాక్టీరియా, వైరల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి విద్యార్థుల హాజరు శాతం తక్కువగానే ఉన్నా ప్రిన్సిపాల్ అకడమిక్ కార్యకలాపాలను నిర్వర్తించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. రోజువారీ మెనూ ప్రకారం 10.48 ప్యాకెట్లు (524 x 0.020గ్రాముల) స్వీట్‌ఆయిల్ జారీ చేయాల్సి ఉండగా, అప్పటి కేర్‌టేకర్ టీజీటీ ప్రేమ్‌కుమార్ 7 లీటర్లు మాత్రమే జారీ చేశారని, మిగతా 3.48 లీటర్ల నూనెను అప్పటికే వినియోగించినదాన్ని వాడినట్టు గుర్తించామని తెలిపారు. దాని కారణంగానే విద్యార్థులు వాంతులు, విరేచనాలకు గురై ఉండొచ్చని నివేదికలో వెల్లడించారు. కమిటీ ఈ నివేదికను మార్చి 12న సొసైటీకి సమర్పించింది. క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలపాలని ప్రిన్సిపాల్, కేర్‌టేకర్‌కు ఇటీవలే ఉన్నతాధికారులు మెమో జారీచేశారు తప్ప చర్యలు తీసుకోలేదు.

అధికారుల మామూళ్ల దందా

సాంఘిక సంక్షేమ గురుకులాలకు సంబంధిత ప్రిన్సిపాలే చీఫ్ వార్డెన్‌గా కొనసాగుతున్నారు. డిప్యూటీ వార్డెన్‌తోపాటు, గురుకులంలో సీనియర్ ఉపాధ్యాయుడు కేర్‌టేకర్‌గా, మరొకరు అసిస్టెంట్ కేర్‌టేకర్‌గా ఉంటున్నారు. మెనూ పాటించడం, నిర్దేశిత నాణ్యత ప్రమాణాల మేరకు సరుకులను వార్డెన్‌కు అందివ్వడం కేర్‌టేకర్ బాధ్యత. క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయో లేదో చూడటం అసిస్టెంట్ కేర్‌టేకర్ విధి. అయితే, అందరూ కలిసి నిబంధనలను గాలికి వదిలేస్తున్నారని తెలుస్తున్నది. డిప్యూటీ వార్డెన్, కేర్‌టేకర్లు నాసిరకం సరుకులను వాడుతున్నారని, అందులోనూ ప్రిన్సిపాల్స్‌కు వాటా ఇస్తున్నారని విద్యార్థి, గురుకుల ఉద్యోగ సంఘాలు వెల్లడిస్తున్నాయి. గురుకుల పాఠశాలకు నెలకు రూ.35 వేలు, డిగ్రీ కాలేజీలకు రూ.50 వేల మెయింటెనెన్స్ నిధులు వస్తుంటాయి. ఆ నిధులతో శానిటేషన్, ఇతర కార్యక్రమాలు నిర్వహించాలి. కానీ, ప్రిన్సిపాళ్లు ఆ పనులేవీ చేయకుండానే బిల్లులు పెట్టి స్వాహా చేస్తున్నారని ఆరోపిస్తున్నాయి.

పేరుకే విజిలెన్స్ విభాగం

గురుకులాల్లో నిబంధనలు అమలవుతున్నాయా? మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతున్నదా? నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? తదితర అంశాలపై తనిఖీలను నిర్వహించేందుకు సొసైటీ పరిధిలో ప్రత్యేకంగా విజిలెన్స్ విభాగం ఉన్నది. ఆ విభాగం పేరుకే తప్ప, చేసేదేమీ లేదని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

చనిపోయేముందు దవాఖానకు తీసుకెళ్తారా!

- గురుకుల విద్యార్థుల మరణాలపై సీఎం సమీక్షించొద్దా ?
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): గురుకుల విద్యార్థి ఫుడ్ పాయిజన్‌తో చనిపోవడం చాలా బాధాకరమని బీఆర్ఎస్ నేత, రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ మాజీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 9న భువనగిరి సంక్షేమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగితే ఐదు రోజుల వరకు ఉపాధ్యాయులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి చనిపోయే ముందు రోజు ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లడం దారుణమని మండిపడ్డారు. గురువారం తెలంగాణ భవన్ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భువనగిరి గురుకుల విద్యార్థి మరణం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, సంక్షేమ శాఖలు రెండూ సీఎం దగ్గరే ఉన్నా ఇప్పటి వరకు విద్యార్థుల మరణాలపై సమీక్షించలేదని విమర్శించారు. గురుకులాల్లో చేరేది పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల పిల్లలేనని, ఇంటి వద్ద సరైన సౌకర్యాలు లేనివాళ్లేననే విషయాన్ని ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ఎంతోభవిష్యత్తు ఉన్న విద్యార్థులు ఇలా చనిపోవడం హృదయ విదారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఘటన చూసి మిగతా విద్యార్థులు కూడా ఖాళీ చేసి ఇళ్లకు వెళ్లిపోయారని తెలిపారు. దీనిపై చిన్నస్థాయి వాళ్లను బాధ్యులుగా చేసి చర్యలు తీసుకుంటే లాభం లేదని, ఇలాంటి వరుస ఘటనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.



మెదక్ జిల్లా చేగుంట మండలం కిష్టాపూర్‌లో కుర్మ స్వామి ఆత్మహత్యకు సంబంధించి వివరాలు తెలుసుకుంటున్న వ్యవసాయ శాఖ ఏడీ వసంత సుగుణ

రైతు ఆత్మహత్యపై అధికారుల ఆరా

కుర్మ స్వామి వివరాలు సేకరించిన వ్యవసాయశాఖ

మెదక్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : రైతు ఆత్మహత్యపై వ్యవసాయ శాఖ అధికారులు ఆరా తీశారు. మెదక్ జిల్లా చేగుంట మండలం కిష్టాపూర్‌కు చెందిన రైతు కుర్మ స్వామి తన పొలంలో పదకొండు బోర్లు వేసినా నీరు రాకపోవడంతో అప్పుల పాలై ఆ పొలంలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. 'పదకొండు బోర్లు వేసినా పంట రాకపాయె' అనే శీర్షికన గురువారం 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన వ్యవసాయ శాఖ అధికారులు గురువారం గ్రామంలోని కుర్మ స్వామి నివాసానికి వెళ్లి ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. స్వామి తల్లిదండ్రులతోపాటు భార్యతో మాట్లాడారు. స్వామి పేరిట గుంట భూమి కూడా లేదని, భూమి ఉంటే రైతుబీమా వచ్చేదని ఏడీ వసంత సుగుణ కుటుంబసభ్యులకు తెలిపారు. ఉన్న ఎకరం కూడా స్వామి తండ్రి ఎల్లయ్య పేరిటే ఉన్నదని పేర్కొన్నారు. స్వామి తనకున్న ఎకరం పొలంలో 11 బోర్లు వేయడంతో అప్పుల య్యాయని, దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు కుటుంబ సభ్యులు వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

నమస్తే ఎఫెక్ట్

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొనుగోలు కేంద్రాల్లో అధికారుల సందర్శన

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

హనుమకొండ సబర్బన్, ఏప్రిల్ 18: హనుమకొండ జిల్లాలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు సందర్శించా రు. 'కలెక్టర్ లోడ్ రిటర్న్' శీర్షికతో గురువారం 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో ప్రచురితమైన కథనం సంచలనంగా మారింది. దీంతో కలెక్టర్ స్పందించారు. జిల్లాలోని తహసీల్దార్లు కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీయాలని ఆదేశించారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఎల్కతుర్తి మండల కేంద్రంతోపాటు, కేశవాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ జగత్‌సింగ్, డీఆర్‌డీవో డీపీఎం ప్రకాశ్, ఏపీఎం రవీందర్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణతో కలిసి సందర్శించారు. కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యపు రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కలెక్టర్ పర్యటన నేపథ్యంలో కమలాపూర్ నుంచి వెళ్లిన ధాన్యం లారీ రిటర్న్ రాలేదని, నిర్ణీత కొనుగోలు కేంద్రంలో దిగుమతి జరిగిందని కలెక్టర్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసిందని చెప్పారు. అదేవిధంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రవాణా చేసేందుకు 5 సెక్టార్ల ద్వారా లారీలను అందుబాటులో ఉంచామని పేర్కొన్నట్టు తెలిపారు.

- కనులపండువగా శ్రీరామ మహాపట్టాభిషేకం

భద్రాద్రి రాముడికి గురువారం మిథిలా స్టేడియంలో అత్యంత వైభవంగా మహాపట్టాభిషేకం జరిగింది. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సీతారాములకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రియాంక, రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఈవో రమాదేవి పాల్గొన్నారు. - ఖమ్మం

వాగ్గేయకారులు శరత్, దేవేందర్‌కు రావణవీణ పురస్కారం

27న వరంగల్‌లో ప్రదానం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమ వాగ్గేయకారులు డాక్టర్ నలిగంటి శరత్ చమర్, మచ్చ దేవేందర్‌లు 'రావణ వీణ–2023' సంగీత సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే ఇంటర్నేషనల్ హిందూ రావణ సేవా వాహిని (ఐహెచ్ఆర్ఎస్‌వీ) ఆవిర్భావ వేడుకల్లో పద్మశ్రీ గడ్డం సమ్మయ్య చేతుల మీదుగా వీరు పురస్కారం అందుకోనున్నారు. 11 మంది సామాజిక శాస్త్రవేత్తలతో కూడిన కమిటీ.. రావణవీణ పురస్కార గ్రహీతలను ఎంపిక చేసినట్టు ఐహెచ్ఆర్ఎస్‌వీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆరూరి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 'జై జై వీరుడా రావణా సూరుడా', 'పెరియార్ మనువాదుల గుడుల్లో రివాల్వర్', 'జోహార్లు జోహార్లు వీరులారా జోహార్లు' తదితర పాటలకు శరత్‌ను ఎంపిక చేసినట్టు వివరించారు. 'ఏమై పోయేవాళ్లమో అంబేద్కర్ లేకుంటే', అంబేద్కర్‌పై వందకు పైగా రాసిన కీర్తనలకు మచ్చదేవేందర్‌ను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ పురస్కార గ్రహీతలకు రూ.25వేల నగదు కూడా అందజేస్తామని తెలిపారు.

ఆరుగురు పోలీసు అధికారుల సస్పెన్షన్

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఆరుగురు పోలీస్ అధికారులను సస్పెండ్ చేసినట్టు ఐజీ ఎవీ రంగనాథ్ తెలిపారు. సస్పెండ్ అయిన వారిలో మల్టీజోన్–1 పరిధికి చెందిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఎస్సైలు, ఒక హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్ ఉన్నారు. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజా భవన్ వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదానికి కారణమైన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్‌ను తప్పించేందుకే పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్‌తో సంప్రదింపులు జరిపినట్టుగా హైదరాబాద్ సీపీ విచారణలో నిజ నిర్ధారణ కావడంతో బోధన్ ఇన్‌స్పెక్టర్ బీడీ ప్రేమ్ కుమార్‌ను సస్పెండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం రమేశ్ మద్యం తాగి పోలీస్ స్టేషన్‌కు వచ్చి సిబ్బందిని ఇబ్బందులకు గురిచేసినట్టు నిర్ధారణ కావడంతో అతనిని సస్పెండ్ చేశారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన గంజాయి కేసులో నిర్లక్ష్యం వహించిన ఎస్సైలు జీ మనోహర్ రావు, ఎ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ బీ రవీందర్ రెడ్డి, కానిస్టేబుల్ టీ నరేందర్‌లు సస్పెండ్‌కు గురయ్యారు. గత ఏడాది సారంగాపూర్ పోలీసులు 70 కిలోల గంజాయిని వాహనంతో సహా పట్టుకొని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. కాగా, స్టేషన్ నుంచి గంజాయిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన విషయం తెలిసిందే.

జూన్ 29 వరకు 132 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి జూన్ 29 వరకు 132 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. పూర్తి షెడ్యూల్ ఎస్‌సీఆర్ వెబ్‌సైట్‌లో ఉందని తెలిపారు.

పకడ్బందీగా పార్లమెంట్ ఎన్నికలు

- రాష్ట్రంలో 3,31,48,527 మంది ఓటర్లు, 35,356 పోలింగ్‌స్టేషన్లు
- 160 కంపెనీల కేంద్ర బలగాలు
- 60 మంది అబ్జర్వర్ల నియామకం
- తొలిరోజు 42 మంది నామినేషన్లు
- సీఈవో వికాస్‌రాజ్

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్ బీఆర్కే భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 25న మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్లను స్వీకరిస్తారని, 26 నుంచి స్క్రూటినీ మొదలవుతుందని, 29లోపు నామినేషన్ విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించినట్టు తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న ఫలితాలు వెల్లడవుతాయని వివరించారు. తొలిరోజైన గురువారం 42 మంది అభ్యర్థులు 48 నామినేషన్లను దాఖలు చేశారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 35,356 పోలింగ్ స్టేషన్లలో 3,31,48,527 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఓటర్లలో 1,64,88,170 పురుషులు, 1,66,57,605 మహిళలు ఉన్నారని, లింగ నిష్పత్తి 1,010గా నమోదైనట్టు తెలిపారు. రాష్ట్రంలో 18–19 ఏండ్ల యువ ఓటర్లు 9,01,942 మంది, 1,93, 641 మంది సీనియర్ ఓటర్లు ఉన్నారని వివరించారు. ఏప్రిల్ 25 నాటికి యువ ఓటర్ల సంఖ్యలో పెరుగుదల లేదా తగ్గుదల ఉండొచ్చని తెలిపారు. ప్రతి ఇంట్లో ఆరుకంటే ఎక్కువ ఓట్లు ఉన్న ఇండ్లకు వెళ్లి 3.87 లక్షల మంది ఓట్లను పరిశీలించామని, కొన్నిచోట్ల చిరునామా సరిగా లేవని గుర్తించనట్టు తెలిపారు. ఇప్పటికే మొదటి లెవల్ పరిశీలన పూర్తయిందని, మొదటి దశలో నిర్దేశించిన ప్రాంతాలకు ఈవీఎంలను తరలిస్తున్నారని, బ్యాటరీలు, సీల్స్, పేపర్‌రోల్స్ అన్నీ సరఫరా చేశామని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నాటి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు రూ.136.7 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, బంగారం, ఇతర ఉచితాలు పట్టుబడినట్టు వెల్లడించారు.

భారీ భద్రతా బలగాలు

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల కోసం 160 కంపెనీల సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌ను కేంద్ర ఎన్నికల సంఘం కేటాయించిందని వికాస్‌రాజ్ తెలిపారు. వీటిల్లో 60 కంపెనీలు ఇప్పటికే తెలంగాణకు వచ్చాయని, 100 కంపెనీల బలగాలు రావాల్సి ఉన్నదని చెప్పారు. వీటికి తోడు సరిహద్దు రాష్ట్రాల నుంచి 20 వేల మంది పోలీసులను తీసుకుంటామని, మరో 60 వేల మంది ఇతర పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొంటారని వెల్లడించారు.

4,099 కోడ్ ఉల్లంఘన కేసులు

రాష్ట్రంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)ని ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని వికాస్‌రాజ్ తెలిపారు. ఇప్పటివరకు ఎంసీసీ కింద 4,099 ఎఫ్ఐఆర్‌లు ఐపీసీ, ఎక్సైజ్ యాక్ట్ ద్వారా నమోదు చేశామని వెల్లడించారు. ఎంసీసీ ఉల్లంఘనపై కేసీఆర్ రాసిన లేఖను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపామని, వారే దానిపై తుది నిర్ణయం తీసుకుంటారని వికాస్‌రాజ్ వెల్లడించారు. సివిజిల్ ద్వారా 877, టోల్ ఫ్రీ నంబర్ 1950 ద్వారా 230 ఫిర్యాదులు వచ్చాయని వివరించారు.

ఓటర్లకు 'వేసవి' సదుపాయాలు

వేసవి దృష్ట్యా అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్టు వికాస్‌రాజ్ తెలిపారు. తాగునీరు, కుర్చీలు, టెంట్లు వేయాలని చెప్పారు. 26 నుంచి ఓటర్ స్లిప్పులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

మొదటిరోజు 42 మంది అభ్యర్థుల నామినేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభమైన మొదటిరోజే 42 మంది అభ్యర్థులు 48 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. అత్యధికంగా మల్కాజిగిరి నియోజకవర్గంలో 8 మంది, నల్లగొండ, మెదక్, పెద్దపల్లి నియోజకవర్గాల్లో 4 చొప్పున, భువనగిరి, వరంగల్, చేవెళ్లలో ముగ్గురు చొప్పున, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో ఇద్దరు చొప్పున, ఖమ్మం, మహబూబాబాద్, జహీరాబాద్‌లో ఒక్కొక్కరు నామినేషన్లు దాఖలు చేశారు.



హైదరాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్లు

కాంగ్రెస్, బీజేపీ ఓటమే ఆటోడ్రైవర్ల లక్ష్యం : వేముల

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ ఓటమే లక్ష్యంగా ఆటోడ్రైవర్లు కదంతొక్కారు. 'డ్రైవరన్నల ఆత్మహత్యలపై స్పందించని కాంగ్రెస్‌ను ఓడించాలి.. తెలంగాణపై విషం చిమ్ముతున్న బీజేపీకి బుద్ధిచెప్పాలి' అంటూ ఆటోడ్రైవర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా టీఏటీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు సుమారు 45 మందికిపైగా మరణించినా పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏనాడు తాము రోడ్డెక్కే దుస్థితి రాలేదని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ.. గురువారం చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరిలో ఆటోడ్రైవర్లు ప్రచారం నిర్వహించినట్టు వివరించారు.

- జేఎన్టీయూ వీసీపై ఈసీకి ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : జేఎన్టీయూ వీసీ కట్టా నరసింహారెడ్డిపై సీఈవో వికాస్‌రాజ్‌కు మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఫిర్యాదు చేసింది. ఎన్నికల కోడ్‌ను అనుసరించకుండా ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో అఫిలియేషన్ కోసం శుక్రవారం నుంచి తనిఖీలు చేయడానికి షెడ్యూల్ జారీ చేశారని ఈసీ దృష్టికి తీసుకెళ్లినట్టు కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మారపు శ్రీకాంత్, నాయకులు తెలిపారు. ఒక పార్టీకి చెందిన నాయకుల కాలేజీలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయని, ఎన్నికల్లో వారికి లబ్ధి చేకూర్చేలా వీసీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా యూనివర్సిటీలో ఇద్దరు డైరెక్టర్లను నియమించారని, ఈ విషయంపై స్పందించాలని ఈసీని కోరినట్లు తెలిపారు.

- తెలంగాణలోకి ఏనుగుల మంద ?

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : ఉత్తర తెలంగాణ సరిహద్దు జిల్లాల ప్రజలు ఏనుగుల భయంతో గజగజ వణికిపోతున్నారు. ఇటీవల ఏనుగు దాడిలో ఇద్దరు రైతుల మృతి మరువక ముందే.. మహారాష్ట్రలో సంచరిస్తున్న 60–70 ఏనుగుల మంద తెలంగాణలోకి వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని ఫారెస్ట్ అధికారులు హెచ్చరిస్తున్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా నుంచి రాష్ట్రంలోని కుమ్రుంభీం–ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ అటవీడివిజన్‌లో ఈ ఏనుగులు అడుగుపెట్టొచ్చని ఆ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

- 23 వరకు రైలు మ్యూజియం

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 23 వరకు రైలు మ్యూజియం సందర్శనకు ఉచిత ప్రవేశం కల్పించినట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో కాచిగూడ రైల్వేస్టేషన్‌లోని రైలు మ్యూజియంలో గురువారం ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్‌సీఆర్ అదనపు జనరల్ మేనేజర్ ఆర్ ధనంజయులు ఉత్సవాన్ని ప్రారంభించారు.

- సీఎం జగన్‌పై దాడి కేసులో నిందితుడికి రిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాయి దాడి కేసులో నిందితుడికి విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టు 14 రోజుల రిమ